క్లుప్తంగా

ట్యాబ్‌ల పంపిణీ

రాజవొమ్మంగి: స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో మండల వ్యాప్తంగా 14 పాఠశాలలకు ట్యాబ్‌ల పంపిణీ చేసినట్టు ఎంఈవో టి.సూరయ్యరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ట్యాబ్‌లు అందజేశామన్నారు. మండల వ్యాప్తంగా గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత, యూపీ పాఠశాలలు, గురుకుల పాఠశాల, ఏకలవ్య పాఠశాలల్లో 8వ తరగతి అభ్యసిస్తున్న 529 మంది విద్యార్థులున్నారని, వారికి ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు.

సేవతోనే సంపూర్ణ ఆనందం



సామూహిక మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న సంస్థ సభ్యులు, దైవ సేవకులు

అనంతగిరి: మండలంలోని కొండిబ పంచాయతీ గరిగుడ్డి గ్రామంలో జేసీఐ వర్క్ ఆఫ్ క్రైస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోని నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోని పాల్గొన్న జేసీఐ అధ్యక్షుడు దిలీప్ మాట్లాడుతూ సంస్థ ద్వారా లక్ష రూపాయలతో సామూహిక మరుగుదొడ్లు నిర్మించామన్నారు. గ్రామాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. సేవతోనే సంపూర్ణ ఆనందం కలుగుతుందన్నారు. దైవ సేవకులు సల్మాన్, సుజాత సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు

కొయ్యూరు: గత రెండు రోజులుగా బీఎస్ఎన్ఎల్ సంకేతాలు నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారంలో కనీసం మూడు నుంచి నాలుగు రోజులు సిగ్నల్ లేకపోవడంతో ఇంటర్నెట్ కూడా పనిచేయడం లేదంటున్నారు.దీంతో బ్యాంకుల్లో, తపాలా తదితరు కార్యాలయలు బ్రాండ్‌బ్యాండ్ పనిచేయకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారని పలువురు చెబుతున్నారు. సమస్యను పలుమార్లు బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇంటర్నెట్‌తో పాటు సెల్ సిగ్నల్స్ కూడా స్తంభించడంతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

రాజేంద్రపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



పనసలపాడులోని శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ మనోజ్ఞ

కొయ్యూరు: ప్రభుత్వ నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ సేవలను ఉపయోగించుకోవాలని రాజేంద్రపాలైం డాక్టర్ మనోజ్ఞ సూచించారు.ఆమె సోమవారం ఎం మాకవరం పంచాయతీ పనసలపాడులో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.గ్రామస్తులకు బీపీ, మధుమేహంతో పాటు ఇతర వ్యాధులు ఏమి ఉన్నా చూస్తామన్నారు. అవసరమైన వారు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రోగులకు మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది రాజేశ్వరి, కామేశ్వరి పాల్నొన్నారు

రగ్గుల పంపిణీ



పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అడ్డతీగల: అడ్డతీగలలోని సీతారామరాజు కాలనీలోని రామాలయం వద్ద సోమవారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో పేదలకు రగ్గుల పంపిణీ చేశారు.అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు, వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్, వీహెచ్‌పి కార్యకర్తలు వెంకటరత్నం, విశ్వనాథం, కృష్ణారెడ్డి, వెంకటకృష్ణ, గంగాశివ ప్రసాద్, చెన్నారెడ్డి, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం తెలిపారు.



- అందుబాటులో అన్ని రకాల విత్తనాలు
- రైతులకు అవగాహన కార్యక్రమాలు
- పెట్టుబడికి ఇబ్బంది లేకుండా రైతు భరోసా

ఆర్‌బీకేలతో రైతులకు భరోసా



పనసలో వ్యవసాయ మెలకువలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



కిలగాడ రైతు భరోసా కేంద్రంలో విత్తనాలతో రైతులు..

ముంచంగిపుట్టు: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాత సాగుకు సౌకర్యాలు కల్పించక పోవడంతో రైతులు నానా అవస్థలు పడుతూ వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులకు అన్ని రకాల విత్తనాలు, వ్యవసాయ మెలకువలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. రైతులు వ్యవసాయం కోసం అప్పులు చేసుకొని నలిగిపోకుండా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం ప్రభుత్వం అందిస్తుంది. దీంతో రైతులకు అన్ని విధాలుగా వ్యవసాయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అందిస్తున్న సాయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా అందిస్తోంది. అన్నదాతల బ్యాంకుల ఖాతాల్లో నేరుగా ప్రభుత్వం జమ చేస్తోంది. ప్రతి రైతు ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అందుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సందేహాలు పరిష్కారమవుతున్నాయి. నిత్యం ఆర్బీకేలలో వ్యవసాయశాఖ సిబ్బంది అందుబాటులో ఉంటూ రైతులకు పంటల సాగుపై సూచనలు, సలహాలు అందిస్తున్నారు. సాగు విధానాలు, ఎరువులు, పురుగుమందుల మోతాదుల విషయంలో రైతుల సందేహాలు తీర్చుతున్నారు. ఆర్బీకే సేవలను వినియోగించుకొని పంటల్లో మెలుకువలు పాటిస్తూ రైతులు లాభసాటిగా సాగాలని వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు గ్రామాల్లో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం సైతం నిర్వహిస్తున్నారు.ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీల్లో విడతల వారీగా రైతు భరోసా సొమ్ము సుమారు రూ.36కోట్ల34 లక్షల రూపాయలను ప్రభుత్వం అన్నదాత బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. దీనికి తోడు ప్రభుత్వం రాయితీపై వరి విత్తనాలు, రాగులు, రాజ్మా వంటి విత్తనాలను రైతులకు అందిస్తోంది.



బాబుశాలో రాజ్‌మా పైరు



కొండపాడలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

మండలం: ముంచంగిపుట్టు

పంచాయతీలు	: 23
గ్రామాల్లో	: 376
జనాభా	: 48,900
రైతులు	: 9100 మంది
ప్రధానపంటలు	:వరి, రాగులు, పసుపు, రాజ్‌మా, కందులు
వరి	: 8979 ఎకరాలు
రాగులు	: 4762 ఎకరాలు
సామలు	: 7484 ఎకరాలు
పసుపు	: 1375 ఎకరాలు
కందులు	: 208 ఎకరాలు
రాజ్‌మా	: 1700 ఎకరాలు

రైతు భరోసా కేంద్రాలు : 8

గ్రామ సచివాలయాలు: 18

మండలంలోని రైతు భరోసా నిధుల జమ

ఆర్థిక సంవత్సరం	రైతులు	రైతు భరోసా నగదు
2021-22	8945	రూ.12.7కోట్లు
2022-23	8862	రూ.11.96కోట్లు
2023-24	8655	రూ.11.68కోట్లు



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర..

జగనన్నకు రుణపడి ఉంటాం

గత టీడీపీ పాలకులు రైతుల గురించి పట్టించుకోలేదు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుతో అండగా నిలుస్తుంది. దీనికితోడు రైతు భరోసా సొమ్ము బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తుంది. ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం చేస్తున్న పెట్టుబడి సాయంతో సేద్యపు ఖర్చులకు,విత్తనాల కొనుగోలుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగనన్న రైతుకు వ్యవసాయంలో సకాలంలో సహాయం చేస్తున్నారు. జగనన్నకు రుణపడి ఉంటాం.

– వి.సుబ్బారావు, రైతు, తల్లాబుతోట గ్రామం, ముంచంగిపుట్టు మండలం..

రైతులకు అండగా ఆర్‌బీకేలు

గతంలో వ్యవసాయ సీజన్ వస్తుందంటే అప్పులు చేసి సాగు చేయాల్సిన పరిస్థితి ఉండేది.ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అప్పులు బాధలు పోయ్యాయి.ఆర్బీకేలలో ప్రతి నెల వ్యవసాయ వ్యవసాయంలో మెలుకువలు,పాటించాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయం అధికారులు సలహాలు ,సూచనలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.రైతులు కోసం ప్రభుత్వం ఆర్బీకేలు ఏర్పాటు చేయడం ఇక చరిత్ర..

– ఎస్.రాంబాబు, బీటా గ్రామం, ముంచంగిపుట్టు మండలం

అన్ని రకాల సేవలు



ఆర్బీకేల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తున్నాము. మండలంలో 8 ఆర్బీకేలు ఉన్నాయి.నిత్యం వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటున్నారు.కాలనికి అనుగుణంగా పంటలపై అవగాహన కార్యక్రమాలు ఆర్బీకేలలో,గ్రామాల్లో నిర్వహిస్తున్నాము.రైతు భరోసా అర్హుల జాబితను ఆర్బీకేలలో ప్రదర్శిస్తున్నాము.రైతులు ఆర్బీకేలను ఉపయోగించుకొని పంటల్లో అధిక దిగుబడి సాధిస్తున్నారు.ఆర్థికంగా బలపడుతున్నారు.

..ఎం.శ్రీనివాస్‌బాబు....

ఏవో....ముంచంగిపుట్టు మండలం.

రోడ్డు పనులు ప్రారంభం

హుకుంపేట: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మండలంలోని ముమ్మరంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని తాడిపుట్టు పంచాయతీ గడుగుపల్లి గ్రామంలో మండల పరిషత్ నిధులతో రూ.2లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను వారు సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మండలంలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పథకాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు కిలగడ సింహాచలం, సర్పంచ్ సోమేలి సత్యవతి, నాయకులు లక్ష్మయ్య, నీలకంతం తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం

గ్రామాల్లో ఉపాధి పనులు

పాడేరు: మన్యంలో గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేస్తున్నామని, కూలీలు సద్వినియోగం చేసుకోని ఆర్థిక ఆసరా పొందాలని ఉపాధి పథకం ఏపీవో కృష్ణమూర్తి చెప్పారు. స్థానిక పీఎంఆర్సీ భవనంలో ఆదివాసీ మిత్ర ఆధ్వర్యంలో రైతులతో మండల స్థాయి అధికారులు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డులు లేని వారంతా కొత్త జాబ్ కార్డులను తీసుకునేందుకు ప్రభుత్వం నిరంతరం అవకాశం కల్పించిందన్నారు. మండల స్థాయి అడ్మినిస్ట్రేటివ్ అధికారి మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా పంపిణీ కాని పక్షంలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రమేష్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తితే తమకు తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆదివాసీ మిత్ర డైరెక్టర్ మన్మథరావు, అధికారులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధి హామీ పథకం ఏపీవో కృష్ణమూర్తి

సైబర్ నేరాలపై అప్రమత్తం

గంగవరం: బ్యాంకు సేవలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని గంగవరం ఎస్‌బీఐ మేనేజర్ కె.సునీల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో నాబార్డు సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై విభూతి బ్రదర్స్‌తో మెజిషియన్ మ్యాజిక్ షో, కళాజాత, వీధి నాటిక, హాస్యవల్లరి కార్యక్రమాలు ద్వారా బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పీఎం జీవన్ జ్యోతి పథకం, పీఎం సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్, సీఎం విశ్వకర్మ రుణాలు, ముద్ర లోను, కేసీసీ రుణాలు, సైబర్ నేరాలు ,గోల్డ్ లోన్, యెనో యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. డ్వాక్రా మహిళాలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కళాజాత నిర్వహిస్తున్న దృశ్యం

సంక్షేమం, అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం



చాపరాతిపాలెంలో స్థానికులకు సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

అడ్డతీగల: చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రం అంతా తారతమ్యం లేని అభివృద్ధి అమలు చేస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు.అడ్డతీగల మండలం ధాన్యంపాలెం పంచాయతీలోని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రావులపాడు,పెనికెలపాడు,చాపరాతిపాలెం,ధాన్యంపాలెం,తియ్యమామిడి,జల్లూరు గ్రామాల్లో ఇరువురు నేతలు ఇంటింటికీ వెళ్ళి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను వివరించారు.అలాగే ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల ద్వారా కలిగిన లబ్ధిని తెలియజేస్తూ రూపొందించిన బ్రోచర్లను అందించారు.ఈ సందర్భంగా ఇరువురు నేతలు మాట్లాడుతూ పేదవాడిని ఆర్థికంగా ఆదుకొని వారి జీవితాల్లో వెలుగులను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నింపారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమల్లోనికి తీసుకొచ్చారన్నారు. రాష్ట్ర రోడ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ, ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, మండల జేసీఎస్ కన్వీనర్ నక్కా మోహన్, ధాన్యంపాలెం ఎంపీటీసీ కురసం అమ్మాజీ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం



ఎంపీపీ బాక ఈశ్వరి

దుంబ్రిగుడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలని ఎంపీపీ బాక ఈశ్వరి అన్నారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలకు నూరు శాతం ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో వెళ్లి జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు గిరిజనులంతా వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపేలా అందరూ శ్రమించాలని పిలుపునిచ్చారు.

క్రీడాకారులకు అభినందనలు

వీఆర్ పురం: ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా మండలానికి చెందిన వడ్డిగూడెం టీమ్ విజయం సాధించి, రంపచోడవరం డివిజన్ స్థాయి ఫైనల్ పోటీకి అర్హత సాధించింది. దీంతో ఆయా క్రీడాకారులను పలువురు అభినందనలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



తైడలో పర్యటిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు స్వామి, నేతలు

అనంతగిరి: జగనన్నను మళ్లీ సీఎం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రేగబోయిన స్వామి అన్నారు. మండలంలోని తైడ, దముకు, అనంతగిరి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం పర్యటించారు. పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని, ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని, వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నవరత్నాల పథకాలపై గ్రామాల్లో ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు.

హైందవ ధర్మ పరిరక్షణకు కృషి

అరకులోయరూరల్: హిందూ ధర్మం పరిరక్షణకు అందరూ కృషి చేయాలని బీజేపీ నాయకురాలు, హిందూ ధర్మ పరిరక్షణ కమిటీ సభ్యురాలు పార్వతమ్మ తెలిపారు. మండల కేంద్రంలో గిరిజన మ్యూజియం అవరణలో వనవాసీ కళ్యాణ ఆశ్రమం సంయుక్తంగా గిరిజన సంస్కృతిక యాత్రలో భాగంగా సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందూవుల హక్కులు చట్టాలను పరిరక్షణ ధ్యేయంగా జనవరి 26న జైపూర్ నుంచి గిరిజన సంస్కృతిక యాత్ర ఫిబ్రవరి 4వరకు సాగి విశాఖపట్నంలో ముగిస్తుందన్నారు. అని గ్రామలను కలుపుకుని హిందూవుల ఆచార సంప్రదయాలు, కట్టుబాట్లు, అలవాట్లుపై విత్రుతంగా ప్రచారం నిర్వహిస్తున్నమన్నారు. గిరిజన పండుగలను నేటి యువతి యువకులు జరుపుకునే విధంగా చైతన్యం కావాలన్నారు. గత పూర్వికులు పాటించే కట్టుబాట్లు అలవాట్లు పాటిస్తేనే నేటి సమాజం సుభిక్షంగా ఉంటుందన్నారు, గిరిజనులే నిజమైన పకృతి ఆరాధ్యులని అప్పటి ఎన్న పర్యవరణ ప్రస్తుతం లేదన్నారు, పూర్వికుల ఆచార సంప్రదాయలను కనుమరుగు కాకుండా పరిరక్షిస్తేనే నిజమైన పర్యవరణ,పకృతి సంపదలను సాధించుకోగలమన్నారు. సత్యనారయణ, చెడ్డ గోపినాథ్, రాంచందర్, ఆనంద్, మహదేవ్, బుద్ధు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకురాలు పార్వతమ్మ.

ఏలూరు సభను విజయవంతం చేయాలి

వీఆర్ పురం: ఏలూరులో వచ్చే నెల 3న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ×సిద్ధం ఎన్నికల శంఖారావ సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు పిలుపునిచ్చారు. రేఖపల్లిలోని ఆయన స్వగృహంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబుల ఆధ్వర్యంలో సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొడ్డు సత్యనారాయణ, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్, మానీటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, నాయకులు చీమల కాంతారావు, ముత్యాల గౌతమ్, మామిడి రాజు,సోడె రాజబాబు, రాము, జొన్నాడ నాగేశ్వరరావు, మాడి ముత్యాలరావు, రామవరం, రాజుపేట, శ్రీరామగిరి, వడ్డిగూడెం పంచాయతీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ సత్తిబాబు

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

గూడెంకొత్తవీధి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని, రాష్ట్రంలో మరలా అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలోని పెదవలస పంచాయతీలో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం సంక్షేమ పథకాల అమలుతీరుపై ఆరా తీశారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, చింతపల్లి మాజీ ఎంపీపీ బాబూరావు, లక్కవరపేట మాజీ ఎంపీటీసీ రామారావు, నాయకులు గిరిప్రసాద్, బుజ్జిబాబు, శ్రీరాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పెదవలసలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరాజు

పాలిసెట్, ఎంసెట్‌లకు ఉచిత శిక్షణ

రంపచోడవరం: ఇంజినీరింగ్, పాలిసెట్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత శిక్షణ అందజేయనున్నట్టు లెనోరా విద్యా సంస్థల చైర్మన్, సెక్రటరీ బర్రె జాన్ రత్నం చెప్పారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తమ విద్యా సంస్థ ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్య అందజేస్తున్నట్టు చెప్పారు. ఉచిత శిక్షణకు సంబంధించిన వివరాల కోసం 9490797594, 9494211112కు సంప్రదించాలని కోరారు. శిక్షణకు హాజరైయ్యే విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు: జర్జుల పంచాయతీ సింధిపుట్టు గ్రామంలో సోమవారం విశాఖపట్నానికి చెందిన రోటరీ క్లబ్ సంస్థ ఆధ్వర్యంలో 300 మంది గిరిజనులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు డిఎం రావు మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో వెనకబడిన గిరిజనులకు మా సంస్థ ద్వారా దుస్తులు అందజేశామన్నారు.ఈశ్వరి,కార్యదర్శి విజయ,గిరిజన సంఘం నేతలు పాల్గొన్నారు.